

# మందారమాల

## సత్యం మందపాటి

నెలనెలా ఓ ప్రతిభామూర్తికి అభినందన మందారమాల 26

### 'మా తెలుగు తల్లి'



'మా తెలుగు తల్లికీ మల్లెపూదండ
మా కన్నతల్లికీ మంగళారతులు
కడుపులో బంగారు కనుచూపులో కరుణ
చిరునవ్వులో సిరులు దొరలించు మా తల్లి
మా తెలుగు తల్లికీ మల్లెపూదండ
మా కన్నతల్లికీ మంగళారతులు
గలగలా గోదారి కదలిపోతుంటేను
బిరబిరా కృష్ణమ్మ పరుగులిడుతుంటేను
బంగారు పంటలే పండుతాయి
మురిపాల ముత్యాలు దొరలుతాయి
మా తెలుగు తల్లికీ మల్లెపూదండ
మా కన్నతల్లికీ మంగళారతులు'

0 0 0

మన తెలుగుతల్లికి మల్లెపూల దండ వేసి, మంగళహారతులు వ్రాసినది శ్రీశంకరంబాడి సుందరాచారి.

తెలుగు తేనెల తీయదనం రుచి చూపిస్తున్న ఈ గీతం మన తెలుగువారి జాతీయ గీతం.

తిరుపతి వాస్తవ్యుడైన సుందరాచారి మధుర కవి. ఆయన్ని గీతాంజలి వ్రాసిన రవీంద్రనాథ్ ఠాగూర్‌తో పోల్చి, ఆంధ్రా ఠాగూర్ అని పిలిచేవారు. సుందర రామాయణం, సుందర భారతం ఆయన వ్రాసిన ఇతర కావ్యాలని తెలుస్తున్నాయి. చక్కటి తెలుగు పదాలను

గుచ్చి, కూర్చి, మల్లెల పరిమళం ఆపాదించగల స్థోమత వున్న రచయిత ఈయన. సుందర రామాయణం తదితర కావ్యాల మీద వచ్చిన సమీక్షలు చదివితే కూడా సరళమైన తెలుగు పదాల పొందిక, మధురమైన నడక గురించి వ్రాసినదే కనపడుతుంది.

0 0 0

ఇంతకుమించి ఆయన వ్రాసిన రచనల గురించి ఎక్కువ సమాచారం దొరకటం లేదు. బహుశా దానికి కారణం, ఆయన తనకి తెలిసిన కొద్దిమందితోనే తిరగటం, తన గురించి ఎక్కువగా ఎక్కడా చెప్పుకోకపోవటం, ఆర్థికంగా చితికిపోయి మద్రాసు నగరంలో చాల దీనస్థితిలో జీవించటం కారణం కావచ్చును.

ఇండియాలో ఎంతోమందికి ఫోన్ చేసినా, అమెరికాలో లభ్యమైన పుస్తకాలలో ఇంటర్నెట్లో వెతికినా, నా సమాచార సేకరణ అనుకున్నంతగా ముందుకిపోలేదు. అయినా సుందరాచారిగారి గురించి వ్రాయాలనే తపన మాత్రం తగ్గలేదు. ఈ పట్టుదలకి ముఖ్యంగా రెండు కారణాలు. ఎన్నో దశాబ్దాల క్రిందట టంగుటూరి సూర్యకుమారి పాడగా విని, ఇన్నేళ్ళయినా ఇంకా ఆ పాటలోని తీయదనం మరిచిపోలేదు. తర్వాత జి. వరలక్ష్మి పాడిన పాట. కొన్నేళ్ళ క్రితం బాలసుబ్రమణ్యం, నిత్యసంతోషిణి పాడిన సీడీ కొనుక్కుని, మనసు బాగా లేనప్పుడూ, వున్నప్పుడూ కూడా తరచుగా వింటూనే వున్నాను. ఎంతో చక్కని పాట. తేనెలూరే కవిత్వం. అది ఒక కారణం.

రెండవది, తెలుగువారిలో తెలుగు సంస్కృతి క్షీణిస్తున్న ఈ రోజుల్లో, ఇండియాలో పెరుగుతున్న కొంతమంది పదిహేను, ఇరవై ఏళ్ళ పిల్లలని అడిగాను ఈ పాట వ్రాసిందెవరో తెలుసా అని. కనీసం ఒక్కరు కూడా కనపడలేదు. మన సినిమా పాటల సంస్కృతిలో ఈ పాట ఇంతకు ముందు విన్నవాళ్ళు కూడా చాల తక్కువ. అలాగే పింగళి వెంకయ్యగారు ఎవరో తెలుసా అంటే, దానికీ సమాధానం లభించలేదు. అందుకే ఇలాటి వారి గురించి, కనీసం తెలుగు చదివే కొంతమందికైనా ఈ సమాచారం అందివ్వాలనే తాపత్రయంతో, ఎంత సమాచారం దొరికితే అంతా అందిస్తున్నాను. మీ దగ్గర ఇంక ఎక్కువ వివరాలు వుంటే దయచేసి, పాఠకులందరికీ తెలిపితే వారితో పాటూ నేనూ సంతోషిస్తాను.

0 0 0

2004వ సంవత్సరం నవంబర్‌లో వారం రోజులు, తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వారి ఆధ్వర్యంలో 'శంకరంబాడి సుందరాచారి సాహితీ వారోత్సవాలు' జరిగాయి. అప్పుడు ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి, తిరుపతిలోని తిరుచానూరు రోడ్డులో అన్నపూర్ణేశ్వరి సర్కిల్లో శంకరంబాడి సుందరాచారిగారి కాంశ్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. అంతేకాదు 'మా తెలుగు తల్లి' పాటని – ఆంధ్రప్రదేశ్ రాష్ట్రగీతంగా ప్రకటించారు.

తన మధుర కవిత్వానికి బ్రతికి వున్నప్పుడు పేరూ పురస్కారం రాకపోయినా, ఆయన పోయిన తర్వాత ఆయనకి ఈ విధంగా విశిష్ట గౌరవం లభించింది.

0 0 0

ఒకసారి మద్రాసులో సాహితీ సభ జరుగుతున్నదిట.

ఆ సభలో వక్త శంకరంబాడి సుందరాచారిని పరిచయం చేస్తూ, ఒకసారి కాదు చాలసార్లు, సుందరంబాడి శంకరాచారి అని చెబుతున్నాడుట. అది వింటున్న సుందరాచారిగారికీ ప్రేక్షకులతోబాటు కొంచెం ఇబ్బందిగానే వుందిట. కొంచెంసేపు అలా సభ జరిగిన తర్వాత, వేదిక పైన వున్న ఆరుద్రగారు లేచారు.

'శంకరంబాడి సుందరాచారిని పేరు మార్చి సుందరంబాడి శంకరాచారి అని ఎన్నోసార్లు అన్నారు పరిచయం చేసినవారు. శంకరాన్ని, సుందరాన్ని ఇటూ అటూ మార్చినా, కనీసం ఆయన బాడీని ముట్టుకోకుండా వదిలేశారు. అదే సంతోషం' అన్నారుట నవ్వుతూ.

0 0 0

'అమ్మ కడుపు చల్లగా' అనే తన ఆత్మకథలో గొల్లపూడి మారుతీరావుగారు సుందరాచారిగారితో తమ అనుభవాలు కొన్ని ఇలా వ్రాశారు.

మారుతీరావుగారు చిత్తూరు ప్రాంతానికి వెళ్ళినప్పుడు, సుందరాచారిగారే స్వయంగా భోజనం వండి వడ్డించేవారుట. సాహితీవేత్తల మీద ఆయనకి అంత గౌరవం.

ఒకసారి పరిషత్తు నాటకాలకి మారుతీరావుగారి 'కళావని' నాటక సమాజం వారు తిరుపతి వెళ్ళి, రైలు స్టేషన్‌కి ఎదురుగా వున్న సత్రంలో బస చేశారు.

రిహార్సల్స్ జరుగుతుండగా శంకరంబాడి సుందరాచారిగారు వచ్చారు.

'చెప్పు మారుతీరావు. నన్నేం సహాయం చేయమంటావు' అంటూ.

'మీరు కవులు. కవి చెయ్యగల సహాయం ఒక్కటే. మా కళావనికి ప్రార్ధనా గీతం రాయండి' అన్నారు.

అక్కడికక్కడ కూర్చుని గీతం కాక, గీత పద్యం వ్రాసి ఇచ్చారు.

వారి సమాజం నటుల్లో సంగీతం తెలిసినాయన ఒకరుండేవారు. వెంటనే శివరంజని రాగంలో ఆ పద్యాన్ని సిద్ధం చేశారు. అప్పటినించీ కళావని సంస్థ ప్రార్ధనా గీతం ఆ విధంగా స్థిరపడిపోయింది. ఆ పద్యం ఇది:

మా 'కళావని' ఓం కార మర్మరాగ
మాధురుల నొంది, భావసంపదను బడసి
పల్కు గజ్జెలు కదల, విశ్వమును వశ్య
పరచుగావుత నటరాజ వందనములు

తర్వాత చాలా సంవత్సరాలకి, ఆఖరిసారిగా సుందరాచారిగారిని తిరుమల మహాద్వారానికి ముందు కలిశారు మారుతీరావుగారు. సుందరాచారిగారిని ఎవరో బలవంతంగా బంగారు కోనేరు వేపు తీసుకువెడుతున్నారు. ఎక్కడో పడిపోయినట్టున్నారు. నుదుటిన, ముఖం మీద రక్తం చిమ్ముతోంది.

ఆయన్ని చూసి షాక్ తిని, 'సుందరాచారిగారూ' అన్నారు.

ఆయన కాస్సేపటికి మారుతీరావుగారిని గుర్తుపట్టారు. 'నా మారుతి, నా మిత్రుడు, నా సోదరుడు' అంటూ ఆయన్ని అమాంతం కావలించుకున్నారు.

ఆయన వాలకం చూసి దిగ్భ్రమతో 'ఏమిటిదంతా' అని అడిగారు మారుతీరావుగారు.

ఆయనతో వున్న మిత్రుడు సమాధానం చెప్పారు. బంగారు కోనేరులో మునిగాక మందు మానేస్తారన్నారుట. తీసుకువెడుతున్నానన్నారు.

'హి ఈజ్ ఎ గ్రేట్ రైటర్. నా తమ్ముడు. ఇతనికి దర్శనం చేయించాలి' అని పట్టుబట్టారు. బలవంతంగా తీసుకువెళ్ళిపోయారు. అదే ఆయన్ని ఆఖరుసారిగా చూడటం.

'ఒక మంచి కవి. తెలుగుదేశానికి చిరస్మరణీయమైన గీతాన్ని ఇచ్చిన కవి యొక్క ఆఖరి రోజులవి. ఏనాడూ సుందరాచారి ధనవంతుడు కాడు. ఎవరికీ తలవొంచే తరహా మనిషి కాదు. జీవిక కోసం రైల్వే కూలీగా, హోటల్ సర్వర్‌గా పని చేసి పొట్ట పోసుకున్న కవి. గర్వంతో, ఆత్మగౌరవంతో కవిత్వం చెప్పిన కవి. 'మా తెలుగు తల్లికి' ఒక్క పాటకే, ఇవాళ ఉంటే ఆయనకు ఈ దేశం బ్రహ్మరథం పట్టేదేమో! లేదా విస్మరించేదో! దేశానికి జాతీయ పతాకనిచ్చిన పింగళి వెంకయ్యని ఎందరు గుర్తుపెట్టుకున్నారు, మొన్నటికి మొన్న హైదరాబాదు టాంకుబండ్ మీద రాతిబొమ్మని చేసేదాకా. తెలుగుతల్లికి మల్లెపూదండని బహూకరించిన మహాకవి. సహృదయుడు. జీవితంలో అతి దయనీయమైన స్థాయినీ, అతి అపూర్వమైన అంతస్తునీ (కనీసం గుండెలో) దర్శించిన వాడు. ఆ రోజు 1976 ఫిబ్రవరి 15. మరో 14 నెలలు మాత్రమే సుందరాచారిగారు జీవించారు' అంటారు గొల్లపూడి మారుతీరావుగారు.

0 0 0

'అమరావతీ నగర అపురూప శిల్పాలు
త్యాగయ్య గొంతులో తారాడు నాదాలు
తిక్కయ్య కలములో తియ్యందనాలు
నిత్యమై, నిఖిలమై నిలిచి వుండేదాక
మా తెలుగు తల్లికీ మల్లెపూదండ
మా కన్నతల్లికీ మంగళారతులు
రుద్రమ్మ భుజశక్తి, మల్లమ్మ పతిభక్తి
తిమ్మరుసు ధీయుక్తి, కృష్ణరాయని కీర్తి
మా చెవుల రింగుమని మార్మ్రోగే దాక
నీ ఆటలే ఆడుతాం, నీ పాటలే పాడుతాం
జై తెలుగు తల్లీ! జై తెలుగు తల్లీ!

0 0 0